మామిడితోటలో నేలరాలిన కాయలను చూపుతున్న రైతులు

ఈదురుగాలులతో మామిడితోటలకు నష్టం

ఓదెల, మే 6: రెండు, మూడు రోజులుగా వీస్తున్న ఈదురుగాలుల కారణంగా మామిడితోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మూడు రోజులుగా వరుసగా సాయంత్రం వేళ బలంగా ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో చేతికి అందివచ్చే సమయంలో మామిడికాయలు నేలరాలి తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నదని రైతులు, మామిడితోటలను లీజుకు తీసుకున్న చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఓదెల, కొలనూర్, కనగర్తి, మడక తదితర గ్రామాల్లోని మామిడికాయలు నేలవాలి నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. ఓదెలలో ముదిరాజ్ కులస్తుల మామిడితోటలో కాయలన్నీ గాలులకు రాలి తీవ్రంగా నష్టపోయినట్లు సంఘ నాయకుడు మంద కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సీఎన్జీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని/మంథని రూరల్, మే 6: వరంగల్–మంచిర్యాల జాతీయ రహదారి సీఎన్జీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మండలంలోని వేంపాడులో జరుగుతున్న జాతీయ రహదారి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని పుట్టపాక,మంథనిలోని ఏఎంసీ మార్కెట్ యార్డు, ఎక్లాస్‌పూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. మంథనిలోని పాత పాలకేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం చేపట్టిన పనులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..యాసంగి సీజన్‌లో రైతులు పండించిన నాణ్యమైన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాటు చేశామన్నారు. మంథనిలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న ట్రైనింగ్ సెంటర్ మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట జిల్లా సహకార అధికారి శ్రీమాల, తహసీల్దార్ కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఏడీఎం అంజని, ఏఈ మౌనిక, ఏపీఎం పద్మ, ప్యాక్స్ సీఈవో అశోక్ ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

పెద్దపల్లి, మే6: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని హెల్త్ సెంటర్లు, సబ్ సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్ మరమ్మతు పనులను వేసవి పూర్తయ్యేలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్ బాబు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ

- 'నమస్తే' కథనానికి స్పందన
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కోల్‌సిటీ, మే 6: కోరుకంటి చందర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సింగరేణి ఓసీపీ–5 ప్రభావిత ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పలు డివిజన్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించారు. వీటిలో గోదావరిఖని పరశురాంనగర్, గాంధీనగర్‌లోని వాటర్ ప్లాంట్లను ఒక్కొక్కటిగా ఆరు నెలల నుంచి మూసివేశారు. ఈ నిర్లక్ష్యంపై గత నెల 29న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఖనిలో మూతపడుతున్న వాటర్ ప్లాంట్లు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ప్లాంట్లను పునరుద్ధరించకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక చేశారు. దీనికి స్పందించిన సింగరేణి అధికారులు ఆగమేఘాల మీద వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టారు. మంగళవారం స్థానిక పరశురాంనగర్‌లోని సింగరేణి స్టేడియం పక్కన గల వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించారు. ప్లాంట్ పునఃప్రారంభం కావడంతో సమీప ప్రాంతాల ప్రజలు మంచినీటిని పట్టుకెళ్తూ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కథనం ప్రచురించిన నమస్తే తెలంగాణకు ఆ డివిజన్‌కు చెందిన సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ డివిజన్ ప్రజల పక్షాన తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి ఎన్టీపీసీ ప్లాంటేషన్ డ్రైవ్

మొక్కనాటి నీరుపోస్తున్న ఎన్టీపీసీ ఈడీ

జ్యోతినగర్, మే 6: ఎన్టీపీసీ తెలంగాణ యాష్‌పాండ్ సమీపంలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి కోసం ఎన్టీపీసీ యాజమాన్యం పెద్ద ఎత్తున మంగళవారం ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చెపట్టింది. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్క నాటి ప్లాంటేషన డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఈడీ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని మెరుగుపరుచడం కోసం ఎన్టీపీసీ సమీప ఏరియాలో 33 ఎకరాల్లో వివిధ రకాల 33వేల మొక్కలను నాటేందుకు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీఎఫ్‌డీసీఎల్)కు అప్పగించినట్లు తెలిపారు. ఇక్కడ ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ జీఎం ఏకే త్రిపాఠి, తెలంగాణ ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ జీఎం ముకుల్‌రాయ్, ఆపరేషన్ జీఎం కేసీ సింఘరాయ్, ఏజీఎం హెచ్‌ఆర్ బిజోయ్ కుమార్ సిక్దర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

కేటీఆర్‌కు మొక్క అందజేస్తున్న చందర్

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, మే 6: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కలిసిన మాజీ ఎమ్మెల్యే ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతంతో కేటీఆర్‌కు మొక్కను బహుకరించి శుభకాంక్షలు తెలిపారు.

తేలుకుంటలో దొంగతనం

జూలపల్లి, మే 6 : తేలుకుంటలో పట్టపగలు దొంగతనం జరిగింది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేవూరి నర్సమ్మ (65) సోమవారం మధ్యాహ్నం తన ఇంటి ముందు నిద్రిస్తుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు పథకం ప్రకారం గుట్టు చప్పుడూ కాకుండా నర్సమ్మ మెడలో ఉన్న దాదాపు మూడు తులాల బంగారం గొలుసు తస్కరించాడు. ఆమె నిద్రలేచి చూసుకునేలోగా గుర్తు తెలియని వ్యక్తి పారిపోయాడు. తనకు తెలిసిన వ్యక్తి వద్ద బంగారం కుదువపెట్టి రూ. 50 వేల నగదు తీసుకున్నాడు. బాధితురాలు జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

బాలికల సాధికారత వర్క్‌షాప్ ప్రారంభం

శిక్షణ బాలికలతో ఎన్టీపీసీ ఈడీ, ఉన్నతాధికారులు

జ్యోతినగర్, మే 6: బాలికల సాధికారత ధ్యేయంగా ఎన్టీపీసీ సీఎస్ఆర్ ప్రభావిత గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఎన్టీపీసీ గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్ పేరిట ప్రతీ ఏడాది వేసవి కాలంలో అందిస్తున్న బాలికల సాధికారత వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ మేరకు మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో వర్క్‌షాప్ శిక్షణను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం శిక్షణ బాలికలకు స్టడీ కిట్లు, యూనిఫామ్‌లు అందజేశారు. బాలికల ఉన్నత విద్యాభివృద్ధికి వివిధ రంగాల్లో నిర్వహించే శిక్షణకు బాలికలు ఆసక్తి చూపారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత, సభ్యులతో పాటు ఎన్టీపీసీ ఉన్నతాధికారులు ఉన్నారు.

జేఎన్‌టీయూ కళాశాల పురోగతిపై డాక్యుమెంటరీ

డాక్యుమెంటరీ షార్ట్ ఫిలింను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

రామగిరి, మే 6: స్థానిక జేఎన్‌టీయూ కళాశాల పురోగతిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో అన్ని బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు లఘుచిత్రం రూపొందించారు. కళాశాల లైఫ్ స్టైల్ ఆఫ్ –2025 పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ విడుదల చేశారు. కళాశాల ప్రాంగణంలోని రెండు అకాడమిక్ బ్లాక్‌లు, లైబ్రరీ, రెండు హాస్టల్స్, హాస్టల్‌లో విద్యార్థుల లైఫ్ స్టైల్, ఈవెంట్స్, ల్యాబ్‌లోని పరికరాలు, గ్రీనరీ, క్రీడా మైదానంను డ్రోన్ సాయంతో చిత్రీకరించారు. డాక్యుమెంటరీ ఫిలిం తీస్తున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, పరిపాలన అధికారి సుమన్, పీడీ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విజయపాల్ పాల్గొన్నారు.

కోలిండియా డ్రెస్‌కోడ్ ఆమోదం

గోదావరిఖని, మే 6: న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ సమావేశంలో కోల్ ఇండియా ఉద్యోగులకు డ్రెస్‌కోడ్‌కు ఆమోదం లభించింది. డ్రెస్‌కు రూ. 12,500 చెల్లించేందుకు అంగీకారం కుదిరినట్లు జేబీసీసీఐ సభ్యుడు మంద నరసింహారావు పేర్కొన్నారు. పురుషులకు నేవీ బ్లూప్యాంట్, స్కై బ్లూ షర్ట్, మహిళా సిబ్బందికి మెరూన్ కలర్ కుర్తీ, నల్ల సల్వార్, దుప్పటా, మెరూన్ బ్యాక్‌గ్రౌండ్ చీర, నల్ల బ్లౌజ్ నాణ్యత కలిగిన దుస్తులను వినియోగంలోకి తీసుకురావాలని యాజమాన్యంకు కార్మిక సంఘాలు పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే కోల్ ఇండియాలో కుదిరిన ఈ ఒప్పందాన్ని సింగరేణిలో కూడ అమలు చేయాలన ఆయన యాజమాన్యంను డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమాన్ పూర్ , మే 6: జూలపల్లి, సిద్ధిపల్లె, గొల్లపల్లెలో మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. జూలపల్లికి చెందిన బీఆర్‌ఎస్‌వై మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్‌ను, సిద్ధిపల్లె గ్రామానికి చెందిన నామని పెద్ద రాజేశం, గొల్లపల్లికి చెందిన గాండ్ల సదయ్య ఇటీవలే మరణించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏఐటీయూసీ సమ్మె నోటీస్

గోదావరిఖని, మే 6: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో ఒకరోజు టోకెన్ సమ్మె కోసం మంగళవారం జీఎం పర్సనల్ కవిత నాయుడుకు సమ్మె నోటీస్ అందజేసినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్రం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని అన్ని కార్మిక సంఘాలు కలిసి తల పెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ యూనియన్ ఆదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధానకార్యదర్శులు వైవి రావు, మడ్డి ఎల్లాగౌడ్, సారయ్య, వీరభద్రం, సమ్మయ్య, వంగ వెంకట్, రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి ఉన్నారు.

ఆర్జీ1,ఆర్జీ-2 జీఎంలకు సమ్మె నోటీస్

ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం సింగరేణి ఆర్జీ–1,2 జీఎంలకు సమ్మెనోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులను కట్టుబానిసలుగా చేస్తుందని, సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం కూడ కట్టు కార్మికుల శ్రమను దోచుకుంటుందన్నారు. కార్మిక సంఘాలు తల పెట్టిన సమ్మెలో సింగరేణిలో కార్మికులు విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, టీసీకేఎస్ అధ్యక్షులు ఉల్లి మొగిళి, కే విశ్వనాథ్, మద్దెల శ్రీనివాస్, ఎఐఎఫ్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ రత్నకుమార్ ఉన్నారు.

పాకిస్తానీలు దేశం విడిచి వెళ్లాలి

పెద్దపల్లి టౌన్, మే 6: భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలు దేశం విడిచి వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. గత నెల 22న పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి అమాయక ప్రజల ప్రాణాలు తీశారని ఆవేదన చెందారు. పాకిస్తాన్ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేయాలని, గడువు ముగిసిన వీసాలను సస్పెండ్ చేయాలని విన్నవించారు. ఇక్కడ నాయకులు జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, కన్నం అంజయ్య, వెలంపల్లి శ్రీనివాస్‌రావు, పల్లే సదానందం, ఎండీ ఫహీం, జాపతి రాకేశ్, శివంగారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు,మే 6 : పాకిస్తానీలు భారతదేశాన్ని విడిచిపోవాలని బీజేపీ పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ అధికారులను కోరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎలిగేడు మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులకు బీజేపీ సీనియర్ నాయకుడు కలువల శ్రీనివాస్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుంట తిరుపతి గౌడ్, చెంద్రకారి శ్రీనివాస్, కోడూరి శ్రీనివాస్, బోగ రమేష్, కట్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దపల్లి, మే6: పెద్దపల్లి మున్సిపల్ రంగంపల్లి, గుండంకట్ట 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని డీఈ రాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7. 30 నుంచి 10 గంటల వరకు కూనారం ఎక్స్ రోడ్, భూంనగర్, శివపురి కాలనీ, టీచర్స్ కాలనీ, వాసవినగర్, శ్రీనివాస థియేటర్, అగ్రికల్చర్ మార్కెట్ ఏరియా, అయ్యప్ప టెంపుల్ ఏరియా, క్రిస్టియన్ కాలనీ, చంద్రకాక నగర్, కొంతం వాడ, ప్రగతినగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

ఓదెల, మే 6: కొలనూర్‌లోని రైల్వే గేట్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని కాంతాల లక్ష్మి (70) మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వృద్ధురాలు రైల్వే గేట్ వద్ద ఒక రైలు వెళ్లడంతో గేట్ దాటుతుండగా మరో వైపు నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొటింది. దీంతో ఆ వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందింది. మంగళవారం ఉదయం సమయంలో బంధువుల ఇంటికి వెళ్లె క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ షాపులు ఏర్పాటు చేయాలి

గోదావరిఖని, మే 6: పట్టణంలోని 74 ప్రభుత్వ రేషన్ షాపుల్లో నల్గురు మాత్రమే ఎస్సీలు ఉన్నారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న రేషన్ డీలర్ షాపులకు ప్రక్షళన చేయించి ఎస్సీ,ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ ప్రకారం షాపులు కేటాయించాలని కోరారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే టెక్నోస్పార్క్ 2కే25

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రాజు

పెద్దపల్లి కమాన్, మే 6 : నవ సమాజ నిర్మాణంలో ఇంజినీరింగ్ విద్యార్థులు భాగస్వాములు కావాలని ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రాజు పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియం కార్యక్రమాన్ని పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు చదువుతో పాటు వినూత్నంగా ఆలోచించడం మెదలు పెడితే నూతన ఆవిష్కరణలకు నాంది పడుతుందన్నారు. దేశాభివృద్ధిలో యువ ఇంజనీర్ల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకే టెక్నోస్పార్క్–2కే25 కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సింపోసియంలో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, ప్రాజెక్టు ఎక్స్పో, జస్ట్ మినిట్, థీమ్ డ్యాన్స్, ఫన్ గేమ్స్, సింగింగ్, రీల్స్, స్టాండప్ కామెడీ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథుల చేతుల సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందజేశారు.

అవయవదానంలో ఆదర్శ దంపతులు

కోల్‌సిటీ, మే 6: గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన బొమ్మక సత్యానంద్–రజిత దంపతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. సత్యానంద్ మంచిర్యాల జిల్లా ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాడు. అతని భార్య రజిత పుట్టిన రోజున తన మరణానంతరం నేత్ర, అవయవాలను దానం చేస్తానని చెప్పాడు. భర్త తీసుకున్న నిర్ణయాన్ని తాను కూడా పాటించింది. తన మరణానంతరం నేత్ర, అవయవాలు దానం చేస్తానని అంగీకరించింది. ఈమేరకు ఆ దంపతులు అంగీకార పత్రాలను సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కేఎస్ వాసుకు అందజేశారు. ఆ దంపతులను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత అనంత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తానిపర్తి విజయలక్ష్మి, శశికళ, బోళ్ల చంద్రశేఖర్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ లక్ష్మణ్‌రావు, మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొని అభినందించారు.

ఆమె కళ్లు సజీవం

శివాజీనగర్‌కు చెందిన బొద్దుల రాయమల్లమ్మ(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమె కళ్లను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు సమీప బంధువు పర్శ రమేశ్ అవగాహన కల్పించారు. మృతురాలి నేత్రాలను దానం చేయడానికి కొడుకు, కోడలు రాజు, అనిత, కూతురు సమ్మక్క, కుమార్ అంగీకరించారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. వారిని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత అనంత రాములు, కేఎస్ వాసు తదితరులు అభినందించారు.

బూడిద లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

జ్యోతినగర్, మే 6: రామగుండం మల్యాలపల్లి ఎన్టీపీసీ రైల్వే‌ట్రాక్ మూలమలుపు వద్ద మంగళవారం ఎన్టీపీసీ బూడిద లారీ ఆదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డైవర్ గాయపడగా 108 సిబ్బంది గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్సపొందుతున్నాడు. బూడిద ఓవర్‌లోడ్‌తోనే ఈ ప్రమాద ఘటన జరిగినట్లుగా తెలుస్తుంది.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ, ఇద్దరికి తీవ్ర గాయాలు

ముత్తారం, మే 6: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన మండలంలోని మైదంబండ రోడ్‌పై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బేద సంపత్ ముత్తారం నుంచి గోదావరిఖని వైపు, కట్ల రవీందర్ రెడ్డి బేగంపేట నుంచి ముత్తారం వస్తున్నారు. ఈ క్రమంలో మైదంబండ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. సంపత్ చేయి విరగగా, రవీందర్ రెడ్డి కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రవీందర్ రెడ్డిని కరీంనగర్ కు తరలించారు.

సీఎం వ్యాఖ్యలు బాధాకరం

పెద్దపల్లి కమాన్, మే 6 : ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు కానట్టు మాట్లాడటం దిగ్భ్రాంతికి గురి చేశాయని టీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బహుత్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లకు పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు మాత్రమే కదా త్వరగా ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేనని, కొత్తవేం కావని పేర్కొన్నారు. తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భాగస్వాములేనని అన్నారు. త్వరితగతిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, రిటైర్డు అయిన ఉద్యోగులకు పూర్తి బెనిఫిట్లు అందించాలన్నారు. హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

యూడీఐడీ నంబర్ జారీపై అవగాహన

పెద్దపల్లి, మే6: జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి యూడీఐడీ నంబర్ కేటాయించామని డీఆర్‌డీవో ఎం కాళిందిని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో యూనిక్ డిసేబులిటీ ఐడి జారీపై జడ్పీ సీఈవో నరేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారితో కలిసి ఆమె సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.అధికారులకు యూడీఐడీ నంబర్ జారీపై అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2023 అక్టోబర్ 31నాటికి జారీ చేసిన సదరం సర్టిఫికెట్లకు యూడీఐడీ కార్డు నంబర్ జనరేట్ చేసి దివ్యాంగులకు పంపిణీ చేశామని తెలిపారు. దివ్యాంగులకు ఎవరికైనా యూడీఐడీ నంబర్ లేని పక్షంలో ఆధార్/ మొబైల్ నంబర్ ద్వారా యూడీఐడీ పోర్టల్ నందు తెలుసుకోవచ్చని సూచించారు. 2023 నవంబర్ 1కంటే ముందు సదరం సర్టిఫికెట్ పొంది యూడీ ఐడీ నంబర్ లేని వారు డీఆర్‌డీవో కార్యాలయంలో సంప్రదించాన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, భవిత సెంటర్ నిర్వాహకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్,మే06: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి జిల్లా లీగల్ సర్వీస్ సెక్రటరీ స్వప్న రాణి అన్నారు. చిన్నకల్వల పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు స్వప్నా రాణి మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా న్యాయ సహాయం అందాలనే ఉద్దేశంతో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరకట్న వేధింపులు, భూ తగాదాలు, గృహహింస కేసుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రణధీర్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ప్రమాద మృతుడికి రూ. 82లక్షల పరిహారం

గోదావరిఖని, మే 6:ఆర్జీ–1 పరిధి ఓసీపీ–5 ప్రాజెక్టులోని సోమవారం ట్యాంకర్ బోల్తాపడిన ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ వికాస్‌కుమార్ కుటుంబానికి బీమా పరిహారం కలిపి రూ.82లక్షల చెల్లించేందుకు అంగీకారం కుదురింది. బీహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్ ఓసీపీలో పనిచేస్తున్న క్రమంలో మృతి చెందాడు. సోమవారం రాత్రి నుంచి చేపట్టిన ఆందోళన తో కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యం, ప్రవేటు ఓవర్ బర్డెన్ యాజమానులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పీసీ పటేల్ కంపెనీ బాధిత కుటుంబానికి రూ. 42 లక్షల పరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. బీమా రూపంలో మరో రూ. 40లక్షల చెల్లింపులు జరుగనున్నట్లు పేర్కొనడంతో కార్మిక సంఘాల నేతలు అంగీకారం తెలిపారు. చర్చల్లో వివిధ యూనియన్ల నాయకులు మడ్డి ఎల్లయ్య, జనక్‌ప్రసాద్, ధర్మపురి, నరసింహారెడ్డి, తుమ్మల రాజారెడ్డి, రియాజ్ అహ్మద్, ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

సుల్తానాబాద్‌రూరల్,మే 6: గర్రెపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో కాళిందిని మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కాళిందిని మాట్లాడుతూ. ధాన్యం తూకం వేస్తు బస్తాలలో నింపడంలో మహిళ హమాలీల పనులు బాగా చేయడం జరుగుతుందన్నారు. సెంటర్లలో మాచర్లు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి తరలించాలని సూచించారు. ట్యాబ్ డేటా ఏంట్రీ ఏరోజు ది ఆరోజు డేటా ఏంట్రీ జరుగాలని సంబంధిత సెంటర్ ఇంచార్జులకు, ఏపీఎంలను కోరారు. వెంట ఐకేపీ ఏపీఎం గీత, రైతులు, ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, మే6: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా లు వేగవంతం చేయాలని పెద్దపల్లి ఏడీఏ శ్రీనాథ్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. కాల్వశ్రీరాంపూర్ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి లో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యాలయంలో ఏడీఏను సత్కరించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మాజీ సర్పంచులు గాజనవేన సదయ్య, దేవేందర్‌రావు, మాదాసి సతీశ్, మార్కెట్ డైరెక్టర్లు ఎనగంటి రవి, ద్యాగేటి రాంచంద్రం, నాయకులు మొగిళి సదానందం, బంగారి రమేశ్, , శ్రీకాంత్, నేదురు రమేశ్ లు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఎలిగేడు,మే 6 :మండలంలోని శివపల్లి నుంచి నర్సయ్యపల్లి(ఎస్సీ కాలనీ)వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. త్వరలోనే శివపల్లి నుంచి సుల్తాన్‌పూర్ రోడ్డును కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,కాంట్రాక్టర్లు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రతో.. దిగొచ్చిన కేంద్రం

పాలకుర్తి, మే6: రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్ర ద్వారా కేంద్రప్రభుత్వం దిగి వచ్చి దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చేపట్టిందని రామగుండం, పెద్దపల్లి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావు పేర్కొన్నారు. పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామంలో మంగళవారం రాజ్యాంగపరిరక్షణ యాత్ర నిర్వహించారు. గ్రామంలోని పెట్రోల్‌బంకు నుంచి గ్రామ పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారుడు హర్కరవేణుగోపాల్‌రావు, పార్టీ పరిశీలకుడు జంగారాఘవరెడ్డి, ప్యాక్స్‌చైర్మన్ బయ్యపుమనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, పాలకుర్తి, అంతర్గాం మండలపార్టీల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, పెండ్రు హన్మాన్‌రెడ్డి, రెండు మండాలల ముఖ్యకాంగ్రెస్‌నాయకులు, గ్రామశాల అధ్యక్షులు పాల్గొన్నారు.